

'ముస్కాన్' మురిసేదెన్నడు?

అణచివేతకు గురవుతున్న బాలలను రక్షించేందుకు చేపట్టే 'ఆపరేషన్ ముస్కాన్' జిల్లాలో ముందుకు సాగడంలేదు. 8లో▸



నిషేధిత మందుల విక్రయం

నిషేధిత, హానికర మందులను విక్రయించ రాదని ఆదేశాలున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. 8లో▸



భూ తగాదాలతోనే హత్య

లచ్చా నాయక్ తండాకు చెందిన విఠల్‌నాయక్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. 8లో▸

శుక్రవారం । 7 । జులై । 2023

న్యూస్‌రీల్

నిజాయితీ చాటిన పోలీస్ సిబ్బంది



పర్సు అందిస్తున్న పోలీస్ సిబ్బంది

అనంతగిరి: పోలీస్ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. వికారాబాద్ నుంచి వరంగల్ జిల్లాకు బందోబస్తు నిమిత్తం వెళ్తున్న పోలీసు సిబ్బందికి మార్గమధ్యలో పర్సు దొరికింది. ఆ పర్సులో విలువైన బ్యాంకు కార్డ్స్, ఇతర విలువైన పత్రాలతో సహా రూ.31వేల నగదు ఉంది. పర్సులో ఉన్న ఆధారాలతో ఒరిస్సాకు చెందిన మహేంద్ర బేహారా అనే వ్యక్తికి చెందినదని తెలుసుకున్నారు. ఆర్ఎస్ఐ రాములు సహాయంలో సదరు వ్యక్తికి పర్సు అందించారు. పోయిన పర్సు మళ్లీ దొరకడంతో మహేంద్రా బేహారా పోలీస్‌సిబ్బందికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఓడీఎఫ్‌గా మార్చేందుకు కృషి చేద్దాం'

యాలాల: కోకట్ గ్రామ పంచాయతీని ఓడీఎఫ్‌గా మార్చేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మి, ఎంపీఓ యాదయ్య అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లాలో 13 పంచాయతీల్లో ఓడీఎఫ్ గ్రామాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కోకట్ పంచాయతీలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలతో ఓడీఎఫ్‌గా మారేందుకు అవకాశం ఉందన్నారు. వారం రోజులుగా గ్రామంలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు లేని లబ్ధిదారులు తప్పక నిర్మించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, ఇంకుడు గుంతల నిర్మాణాలతో కలిగే లాభాలను వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జనార్దన్, ఈసీ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఐకేపీ సీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు ఉన్నారు.

గురుకుల కళాశాలలో 11న స్పాట్ కౌన్సెలింగ్

కుల్కచర్ల: బండవెల్కిచర్లలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 11న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగారాం నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు గిరిజన విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94411 25095ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్

ధారూరు: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కారోబార్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండు చేస్తూ గురువారం నిరవధిక సమ్మె చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు మహిపాల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలను క్రమబద్ధీకరించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ప్రమాదబీమా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రైతు సంఘం, గిరిజన సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ కోర్సు

చేవెళ్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ (బ్యాచిలర్స్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) కోర్సుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనురాధ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బీఎస్సీ, బీఏ, బీకాం, కోర్సులతో పాటు బీబీఏ కోర్సులో కూడా విద్యార్థులు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 60 మందికి అవకాశం ఉందని చెప్పారు. ఈ కోర్సు ఎంబీఏ విద్యాభ్యాసం చేసేందుకు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందటానికి అవకాశం ఉంటుందన్నారు.

సమన్వయం ముఖ్యం.. అభివృద్ధే లక్ష్యం

పనులు సకాలంలో పూర్తిచేయండి

- పారిశుద్ధ్య సమస్య రావొద్దు
- విద్యలో ఫలితాలు మెరుగుపడాలి
- హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి
- జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ సునీతారెడ్డి



జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్: అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏడు స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో స్థాయీ సంఘాల చైర్మన్లు సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల్లో నిర్వహిస్తున్న పనులు, జరుగుతున్న పురోగతిపై సమీక్షించారు. ఆర్థిక, ప్రణాళిక, విద్య, వైద్యం, గ్రామీణ నీటి పారుదల, పారిశుద్ధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, విద్యుత్, గ్రామీణాభివృద్ధి తదితర స్థాయీ సంఘాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ జెడ్పీ నిధులతో చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పనుల నిర్వహణలో నాణ్యత పాటించాలని, ఈ విషయంలో ఆయా శాఖల ఇంజనీర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్య సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విద్యలో ఫలితాలు మెరుగు పడాలన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా పర్యవేక్షించాలన్నారు. ప్రస్తుత హరితహారంలో నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని ఆమె సూచించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. హరితహారం కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాముల్ని చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విత్తనాలు విత్తుకోండి

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా ప్రారంభమైనందున త్వరితగతిన విత్తనాలు వేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు అందజేయాలని వ్యవసాయ స్టాండింగ్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆ శాఖపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎంత శాతం విత్తనాలు విత్తుకోవటం పూర్తయ్యింది. ప్రస్తుతం ఏయే పంటలు వేసుకోవటానికి సమయం ఉంది? ఎరువులు, విత్తనాలు ఎంతమేరకు అందుబాటులో ఉన్నాయనే విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు

విద్యాశాఖ తీరేవేరు!

విమర్శలకు తావిస్తున్న అధికారుల పనితీరు

- కానరాని జవాబుదారీతనం
- సొంత పనులకే పరిమితం
- శాఖలో కొరవడిన సమాచారం
- ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు

వికారాబాద్ : విద్యాశాఖ అధికారుల పనితీరు విమర్శలకు దారితీస్తోంది. అటు ప్రభుత్వ ఇటు ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి వద్ద ఎలాంటి సమాచారం లేకపోగా పాఠశాలల నిర్వహణపై కూడా కనీస పట్టు ఉండటంలేదు. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా అట్టడుగున నిలవటమే వారి పనితీరుకు అద్దం పడుతోంది. మరో వైపు ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అడ్డుకోవటంలో విఫలమవుతుండటం విమర్శలకు తావిస్తోంది. విద్యార్థులపైనే లైంగిక వేధింపులకు పాల్పడుతుండటం, విధులకు గైర్హాజరై సొంత వ్యాపారాలు చేసుకోవడం..ప్రైవేటు బడుల్లో ఫీజులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తుండటం.. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు అనుమతులు ఇస్తుండటం చూస్తుంటే ఆ శాఖ అధికారుల పర్యవేక్షణాలోపం, లోపాయికారితనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఓ కార్పొరేట్ సంస్థకు చెందిన రెండు పాఠశాలలు (వికారాబాద్, తాండూరులలో) ఫోర్జరీ చేసి సృష్టించిన ఫేక్ సర్టిఫికెట్లతో ఐదేళ్లుగా పాఠశాలలు నిర్వహిస్తున్నా.. ఓ ప్రైవేటు వ్యక్తి విషయం బయట పెట్టే వరకు విద్యాశాఖ గుర్తించకపోవటం వారి పనితనానికి నిదర్శనం. అయితే సదరు పాఠశాలలను వేసవి సెలవుల సమయంలో సీజ్ చేసి మళ్లీ పాఠశాలల రీ ఓపెన్ సమయానికి తెరవటం విమర్శలకు తావిస్తోంది. పాఠశాలను సీజ్ చేస్తున్నాం .. మీ పిల్లలను వేరే పాఠశాలలో చేర్పించుకోండని పత్రికల ద్వారా పేరెంట్స్‌కు చెప్పిన అధికారులే మళ్లీ ఓపెన్ చేయటంపై గమనార్హం.

సమాచారం నిల్

సమాచార హక్కుల వేదిక ఉద్యమకారుడు విద్యాశాఖను కోరడంతో అనేక విషయాలు బయటకొచ్చాయి. అయితే ఆ వేదిక ద్వారా కోరిన ఆరు రకాల సమాచారంలో ఏ ఒక్కటీ తమ దగ్గర లేదని విద్యాశాఖ చేతులెత్తేయడం విస్మయం కలిగిస్తోంది. పట్టణాల్లో నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి ఐదు సంవత్సరాల అడ్మినిస్ట్రేషన్ వివరాలు అడిగారు. ఆడిట్ వివరాలు..అకౌంటెంట్ సర్టిపై చేసిన కాపీ, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల వివరాలు, ప్రతిపాదించిన ఫీజు చార్టు, వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ తదితర వివరాలు వారు అడిగారు. ఇందుకోసం వారు దరఖాస్తు చేసుకుని పది నెలలు అవుతున్నా సమాచారం ఇవ్వకపోవటంతో రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే పాటు కోర్టును సైతం ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వారు అడిగిన వివరాల్లో ఒక పాఠశాల వారు అందజేసిన ఫీజు చార్ట్‌లో పొందుపరిచిన ఫీజులు పరిశీలిస్తే దానికి నాలుగింతలు వసూలు చేస్తున్నట్టు తేలింది.

నిబంధనలు గాలికి..

ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసుకోవాలంటే పలు రకాల నిబంధనలు పాటించాల్సి ఉండగా యాజమాన్యాలు గాలికొదిలేస్తున్నాయి. పాఠశాలకు అవసరమైన స్థలం, ఆట స్థలం, భవనం నమూనా, బిల్డింగ్ స్ట్రక్చర్ సౌండ్, ఎస్ఎంసీ అప్రూవల్ ఫీజ్ చార్ట్, రోడ్డుకు దగ్గరగా ఉంటే జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు, లైబ్రరీ, ల్యాబ్, అర్హులైన బోధనా సిబ్బంది తదితర సర్టిఫికెట్లు విద్యాశాఖకు సమర్పించాల్సి ఉంది. అయితే సర్టిఫికెట్లు నిజమైనవా కావా? విచారణ జరిపి విద్యాశాఖ అధికారులు నిర్ధారించి ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుంది. అనంతరం ఉన్నతాధికారులు ఆ పాఠశాలలను రెన్యువల్ చేయటం, కొత్త అనుమతులు ఇచ్చే విషయంలో నిర్ణయం తీసుకుంటారు. నిబంధనలు చాలా వరకు పాటించకపోగా ముబ్బడిగా అనుమతులు ఇస్తున్నారు. రోడ్లకు అనుకుని ఉన్న పాఠశాలలకు ట్రాఫిక్ ఎన్ఓసీ ఇస్తున్నారు. కనీసం ప్లే గ్రౌండ్ కూడా లేని, ఫైర్ సేఫ్టీ లేకున్నా ఫైర్ ఎన్ఓసీ ఇస్తున్నారు. ఎస్ఎంసీ అప్రూవల్ అనుమతులు లేని ఫీజు చార్టును తల్లిదండ్రులపై రుద్దుతున్నారు. ఇవన్నీ కళ్లముందే జరుగుతున్నా.. విద్యాశాఖ పట్టనట్టే వ్యవహరిస్తుండటం గమనార్హం.

నిబంధనలు పాటించాల్సిందే

డీఈఓ రేణుకాదేవి

వికారాబాద్ అర్బన్: ప్రైవేటు పాఠశాలలు కచ్చితమైన నిబంధనలు పాటించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రైవేటు పాఠశాలల యాజమన్యం, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు పాఠశాల తప్పనిసరిగా యాజమాన్య బోర్డు, గవర్నింగ్ బాడీని నియమించుకోవాలన్నారు. బోర్డు సభ్యులు నెలవారి సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతి నెలా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రతా కమిటీల ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు లోబడే ఫీజులు ఉండాలని, ఎట్టి పరిస్థితిలోనూ పాఠశాలల్లో పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం అమ్మకూడదని స్పష్టం చేశారు. స్కూల్ బస్సులు భద్రతానియమాలు పాటించాలన్నారు. అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎడ్, బీఎడ్ శిక్షణ పొందిన వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించుకోవాలన్నారు. ఈ నెల 31వరకు పఠనోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

అక్రమాలకు నిలయం



విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు కొమ్ముకాసేలా వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు బడులపై కనీస సమాచారం కూడా అధికారుల దగ్గర లేదు. వికారాబాద్ డీఈఓ కార్యాలయంలో సమాచారం కోసం దరఖాస్తు చేసి పది నెలలు దాటింది. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి సమాచార హక్కుల వేదిక తరఫున కోర్టులో దావా వేస్తాం. ఎలాంటి విచారణ లేకుండానే ఎన్ఓసీలు జారీ చేస్తున్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– దిడ్డికాడి గోపాల్, టీఎస్‌హెచ్‌వీ నాయకుడు

'మనబడి' పనుల్లో నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరిక
- ఈడబ్ల్యూ ఐడీసీ అసిస్టెంట్ ఇంజనీర్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగింపు

వికారాబాద్ అర్బన్: మన ఊరు– మనబడి పథకం కింద పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా మనబడి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనబడి పనుల్లో జిల్లా వెనుకబడి ఉందని, నిధుల కొరత లేనప్పటికీ పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. అధికారులు శ్రద్ధతో పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే వాటిని అధిగమించి పనులు వేగిరం చేయాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తాండూరు ఈడబ్ల్యూ ఐడీసీ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మనబడి పనుల్లో ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. కొన్ని మండలాల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదని, పనులు వెంటనే ప్రారంభించి ఈనెలాఖరులోగా పూర్తి చేయాల ని ఆదేశించారు. నిధుల కొరత లేదని పెండింగ్ బిల్లులకు సంబంధించి ఎఫ్‌టీఓలు అప్‌లోడ్ చేస్తే డబ్బులు వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు.

269 పంచాయతీ భవనాలు మంజూరు

జిల్లాకు కొత్తగా 269 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ పనులను సోమవారం వరకు గ్రౌండింగ్ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులకు ఎన్నికల విధులలో భాగంగా సెక్టర్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని, దీనికి సంబంధించిన ఆదేశాలు కూడా జారీ చేశామన్నారు. అవసరమైన శిక్షణ తరగతులు కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, వివిధ ఇంజనీరింగ్ శాఖల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కేసీఆర్ దంపతులకు ఆహ్వానం



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

- యాగానికి త్వరలో రాక
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: యాగ ఉత్సవాలకు త్వరలో సీఎం కేసీఆర్ దంపతులు హాజరవుతారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. దేశ చరిత్రలోనే కనీవిని ఎరుగని యాగాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో పాటు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో రాజశ్యామల, శతచండి, సౌర, లక్ష్మి సుదర్శన సహిత అతిరుద్ర మహాయాగం ఈ నెల 3 నుంచి నిర్విఘ్నంగా కొనసాగుతోందన్నారు. లోకకల్యాణం కోసం నిర్వహించే ఈ యాగానికి అందరూ సహకరిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, బీఆర్ఎస్ పార్టీ దేశ వ్యాప్తంగా విస్తరించాలని కోరుకున్నట్లు తెలిపారు. మొదట 11 వేల మంది దంపతులను యాగానికి ఆహ్వానించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన వల్ల 20 వేల మంది పూజలో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. యాగంలో కూర్చునేందుకు ముందస్తు స్లాట్ బుకింగ్ విధానం లేకుండానే యాగానికి వచ్చిన దంపతులకు నేరుగా పూజలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులు ఈ ఉత్సవాలకు హాజరై ఆశీర్వదించి వెళ్తున్నారన్నారు. మరో 9 రోజుల పాటు జరిగే యాగ ఉత్సవాలకు సీఎం కేసీఆర్ దంపతులు హాజరు కానున్నారన్నారు. సీఎం హాజరయ్యే తేదీని ప్రకటిస్తామన్నారు.

ఎమ్మెల్యేను ఆశీర్వదించిన బ్రాహ్మణులు

వేద పండితులు, బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం దాదాపు 40 మంది బ్రాహ్మణులను ఎమ్మెల్యే సన్మానించి సంభావన అందించారు. కార్యక్రమంలో అర్చక సమాజం అధ్యక్షులు పురందరచార్‌శుక్రవార్, ఉత్తరాధిమఠం అర్చకులు సుధీంద్రాచార్యులు, వేద పండితులు తదితరులున్నారు.

బస్సు పాయె.. నిరీక్షణ తప్పదాయె

సమయానికంటే అరగంట ముందే ఆర్టీసీ బస్సు వెళ్లిపోవడంతో బంట్వారంలో గురువారం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వికారాబాద్, తొర్మామిడి బస్సు సాయంత్రం 5.15 గంటలకు బంట్వారం రావాల్సి ఉండగా 4.30 గంటలకే బంట్వారం నుంచి వికారాబాద్ వెళ్లిపోయింది. ఆ రూటులో ప్రయాణించే మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 150 మందికి పైగా రోడ్డు పైనే గంటల తరబడి నిరీక్షించారు. యాచారం, మాలసోమారం, ఎన్నారం, కోట్‌పల్లి వెళ్లే విద్యార్థులకు రోజు ఇదే పరిస్థితి ఎదురవుతోంది. డ్రైవర్లు సరైన వేళలు పాటించక పోవడం వల్లే తిప్పలు తప్పడంలేదని విద్యార్థులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

– బంట్వారం



బస్సు అరగంట ముందే వెళ్లడంతో రోడ్డుపై విద్యార్థుల పడిగాపులు

మాకెప్పుడు రాగిజావ సారూ?

- విద్యార్థుల ఎదురుచూపులు
- మొదటి విడతగా 5వేల మందికి మాత్రమే సరఫరా
- గత నెల 20న అట్టహాసంగా ప్రారంభించిన విద్యాశాఖ



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రత్యేక రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గత నెల 20న విద్యార్థులకు రాగిజావ అందించే కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. అయితే ఈ కార్యక్రమం అమలులో చిత్తశుద్ధి కనిపించడం లేదు.

91 వేల మంది విద్యార్థులు

జిల్లాలో 1053 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సుమారు 91 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే చాలా మంది విద్యార్థులు సరైన సమయానికి భోజనం చేయకపోవడంతో పాటు , పౌష్టికాహారం తీసుకోరు. దీంతో వారి వయసుకు దగ్గ ఎదుగుదల కూడా లేదు. పైగా బాలికలు తరగతి గదుల్లో నీరసించి పడిపోతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ విషయాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బెల్లంతో కూడిన రాగి జావ ప్రతి రోజు ఇచ్చేందుకు నిర్ణయించింది. ప్రభుత్వం ఏ లక్ష్యంతో అయితే ప్రారంభించిందో ఆ లక్ష్యం నెరవేరడం లేదు. ఈ పథకం ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు కాలేక పోయింది. జూన్ 20న కేవలం 5వేల మంది విద్యార్థులకు నెల రోజుల పాటు సరిపడే రాగి పిండి, బెల్లం పొడిన మాత్రమే సరఫరా చేశారు. ప్రస్తుతం ఆ 5వేల మంది విద్యార్థులే రాగి జావ తాగుతున్నారు. మిగతా విద్యార్థులు ప్రభుత్వం అందించే రాగి జావ కోసం ఎదురు చూస్తున్నారు.

త్వరలో అందరికీ సరఫరా

మొదటి విడతలో భాగంగా 5వేల మంది విద్యార్థులకు నెల రోజులకు సరిపడే రాగిపిండి, బెల్లం పొడి సరఫరా చేశాం. దశల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అవుతుంది. విద్యార్థులకు అందించడంలో కొంత జాప్యం జరుగుతోంది. త్వరలో అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం.

– డీఈఓ, రేణుకాదేవి

క్లుప్తంగా

ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించిన శివయోగి

నాలుగో రోజు కొనసాగిన అతిరుద్ర మహాయాగం



పూజలో పాల్గొన్న శివయోగి శివాచార్య మహాస్వామి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తలపెట్టిన శ్రీ రాజశ్యామల, శత చండీ, సౌర, లక్ష్మీ సుదర్శన సహిత అతిరుద్ర మహా యాగానికి కోటి బిల్వ లింగేశ్వర మఠం, తంగడపల్లికి చెందిన షటస్థల బ్రహ్మ శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను, కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

చిగురించిన ఆశలు

హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు



సంఘాయిపల్లి శివారులో పత్తి మొలకలు

కొడంగల్ రూరల్: సీజన్ ప్రారంభమైనా వర్షాలు కురవకపోవడంతో నిన్నమొన్నటి వరకు దిగాలు చెందిన రైతులు.. వరుస వర్షాలతో హర్షం వ్యక్తంచేస్తున్నారు. నెల రోజుల క్రితం భూమిలో సరైన పదును లేకపోయినా.. కొందరు రైతులు విత్తనాలను విత్తుకొని ఆకాశం వైపు దిగాలుగా చూసేవారు. ఎండ వేడిమికి పదునులేని పొలంలో వేసిన విత్తనాలు, వాటి కొనుగోలుకు చేసిన ఖర్చు వృథా అవుతుందేమోనన్న బెంగతో ఉన్న అన్నదాతలు.. ప్రస్తుత వర్షాలతో మొలకెత్తడంతో ఆనందంగా ఉన్నారు. వర్షాలు సమృద్ధిగా పడిన తరువాతే విత్తనాలు విత్తుకుందామనుకున్న రైతులు పత్తి, కందులు విత్తుకోవడానికి సిద్ధమవుతున్నారు. గతంలో పత్తి విత్తుకున్న రైతులకు పొలంలో విత్తిన మొక్కలతో పాటు విత్తని విత్తనాల స్థానంలో దాట్లు వేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు సాగుకు అనుకూలంగా మారి, దిగుబడి ఎక్కువగా రావాలని రైతులు కోరుకుంటున్నారు.

పట్టాలివ్వండి..

పట్లూర్ గ్రామ రైతుల మొర



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మర్పల్లి: దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని పట్లూర్ గ్రామ రైతులు డిప్యూటీ తాహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మర్పల్లి మండలం పట్లూర్‌లో సర్వే నంబర్ 29లో 20 ఎకరాలకు పైగా నవాబుల భూములు ఉన్నాయని, ఆ భూములను తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. అయితే హైదరాబాద్‌కు చెందిన కొందరు 29 సర్వే నంబర్ భూములు తమవేనని నకిలీ డాక్యుమెట్లు సృష్టించి తమను భయపెడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా తాము సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌ను కోరారు.

‘ముస్కాన్’ మురిసేదెన్నడు?

ప్రారంభంకాని ఆపరేషన్
- చైల్డ్‌లైన్ సిబ్బంది దూరం
- అధికారుల మధ్య సమన్వయలోపం



బాల కార్మికుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

వికారాబాద్ అర్బన్: 14 ఏళ్ల బాలబాలికలకు ఉన్న బందీని విముక్తి చేసి, రెస్క్యూ హోమ్‌కు తరలించేందుకు.. అణిచివేతకు గురవుతున్న బాలలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘ఆపరేషన్ ముస్కాన్’ కార్యక్రమాన్ని చేపట్టింది. కానీ ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో ‘ఆపరేషన్’ సక్రమంగా ముందుకు సాగడం లేదు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఏడాదిలో రెండుసార్లు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. అయితే సంబంధిత అధికారులు బాల కార్మిక చట్టాల అమలు, అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

విముక్తి లేదా?

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఏటా జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్, జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 9 శాఖల అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి, పని చేయాల్సి ఉంటుంది. ఈ ముస్కాన్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్, సీడబ్ల్యూసీ, పోలీస్, రెవెన్యూ, లేబర్, మెడికల్ అండ్ హెల్త్, ఎన్జీవో, విద్యాశాఖ అధికారులు భాగస్వామ్యం కావాల్సి ఉంది. కానీ, ప్రధానంగా నాలుగు శాఖలైన బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్, సీడబ్ల్యూసీతో పాటు అడపాదడప పోలీస్‌శాఖ అధికారులు సిబ్బంది మాత్రమే కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ వస్తున్నారు. ఈ నెల 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు కూడా. కానీ రెండో వారంలో అడుగుపెడుతున్నా ‘ముస్కాన్’ ఊసే లేదు. జూలై 1న గ్రూప్–4 పరీక్ష ఉండడంతో మొదలు పెట్టలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. కానీ పరిశీలిస్తే అధికారుల సమాధానానికి పొంతన కుదరడం లేదు.

చైల్డ్‌లైన్ బృందం దూరం

ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల్లో క్షేత్ర స్థాయిలో ప్రధాన పాత్ర పోషించే చైల్డ్ లైన్ బృందం ఈ సారి దూరంగా ఉంది. 2015 నుంచి జిల్లాలో దాదాపు 14 మంది చైల్డ్‌లైన్‌లో పనిచేస్తున్నారు. అయితే చైల్డ్‌లైన్ సంస్థ సిబ్బందికి ఎంవీఎఫ్ సంస్థ ద్వారా గౌరవవేతనం ఇస్తున్నారు. చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ కేంద్ర ప్రభుత్వం ఒప్పందంతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పని చేస్తోంది. సదరు సంస్థ రాష్ట్రంలో ఆ బాధ్యతను ఎంవీఎఫ్‌కు అప్పగించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంతో ఆ ఒప్పందం ముగియడంతో రాష్ట్రంలో కూడా ఎంవీఎఫ్‌తో ఒప్పందం ముగిసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వమే కలెక్టర్, శిశు సంక్షేమ శాఖల ద్వారా చైల్డ్ ఇన్‌ఫో పేరుతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను తీసుకునేందుకు దరఖాస్తులు తీసుకుంటుంది. దీంతో ఇన్నాళ్లు పనిచేసిన చైల్డ్‌లైన్ సిబ్బంది ఈ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈ కారణంగా ఆపరేషన్ ముస్కాన్ ఇంకా ప్రారంభం కాలేకపోతుందనే ప్రచారం ఉంది.

నామమాత్రంగా సోదాలు

జిల్లాలో ఆయా శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా తనిఖీలను నామ మాత్రంగా చేస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. నెల రోజుల పాటు బస్టాండ్, రైల్వే స్టేషన్, ఇటుక బట్టీలు, హోటళ్లు, దకాణాలు, వ్యాపార సంస్థలు, బేకరీలు, భవననిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న బాల కార్మికులకు విముక్తి కల్పించడంతో పాటు, బిక్షాటన చేస్తున్న, తప్పిపోయిన పిల్లలను గుర్తించాలి. వీరందరిని చేరదీసి పాఠశాలలు, ఆర్బీసీ కేంద్రాల్లో చేర్పించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో కార్యక్రమం నీరుగారుతుందనే విమర్శలు లేకపోలేదు.

ఐదు సంవత్సరాల్లో చేరదీసిన పిల్లల వివరాలు

సంవత్సరం	ఆపరేషన్ ముస్కాన్	ఆపరేషన్ స్మైల్	ఎఫ్ఐఆర్	ఐఆర్
2019	93	67	0	0
2020	-	88	0	0
2021	232	100	26	0
2022	164	77	09	0
2023	-	118	13	42
మొత్తం	489	450	48	42

భూ తగాదాలతోనే హత్య

- ఎస్పీ కోటిరెడ్డి
- కేసును ఛేదించిన సిబ్బందికి రివార్డులు

అనంతగిరి: లచ్చానాయక్ తండాకు చెందిన విఠల్‌నాయక్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 2న మోమిన్‌పేట మండలం లచ్చానాయక్ తండాకు చెందిన విఠల్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వికారాబాద్ డీఎస్పీ ఆధ్వర్యంలో మోమిన్‌పేట సీఐ వెంకటేషం, వికారాబాద్‌సీఐ శ్రీను, ఎస్ఐలు సంతోష్, భరత్ భూషన్, అరుణ్, ఆనంద్, విఠల్‌రెడ్డి, టాస్క్ ఫోర్స్‌లతో ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి విచారణ జరిపారు. హత్యకు సంబంధించిన వివరాలను గురువారం ఎస్పీ కోటిరెడ్డి తన కార్యాలయంలో వెల్లడించారు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి విఠల్ నాయక్ హత్య చేశారని తెలిపారు. హత్యకు ఉపయోగించిన వాహనంలో దొరికిన ఆధారాలతో, పలువురు ప్రత్యక్ష సాక్ష్యులను విచారించామని పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన తుఫాన్ వాహన డ్రైవర్ సల్మాన్ ఖాన్‌ను, మృతుని బంధువు జైపాల్‌ను విచారించగా కుట్ర బయటపడిందని తెలిపారు.

కారణాలివే..

గ్రామ పరిధిలో సర్వే నంబర్ 75బై 13లో 2.03 ఎకరాల భూమి విషయంలో ఈ కేసులో ప్రధాన నిందితుడు మోతిలాల్‌కు చెందిన భూమిని మృతుడు విఠల్‌నాయక్ వేరే వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో రూ.30లక్షల వరకు ఆర్థికంగా మోతిలాల్ నష్టపోవడంతో కక్ష పెంచుకున్నాడు. విషయాన్ని మోతిలాల్ తన తమ్ముళ్లు పవన్, నరేందర్‌తో పాటు ఇతర నిందితులతో కలిసి హత్యకు కుట్ర చేశారు. అందులో భాగంగానే తుఫాన్ వాహనంతో ఢీకొట్టి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలనే పన్నాగం పన్నారు. కర్నాటక రాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న తుఫాన్ వాహనాన్ని తీసుకొని సంగారెడ్డి జిల్లా కంది గ్రామానికి చెందిన సల్మాన్ అనే డ్రైవర్‌ను రాజు సహాయంతో హత్యకు పథకాన్ని రచించారు. మృతుడు అతని భార్య బైక్‌పై వస్తున్న క్రమంలో మేకవనంపల్లి దాటాక సీఎన్‌జీ గ్యాస్ గోడౌన్ సమీపంలో వేగంగా వచ్చి విఠల్ ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను తుఫాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విఠల్‌నాయక్ మృతి చెందాడు. ఈ కేసులో 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

ప్రాణసంకటంగా రహదారులు



పెద్దేముల్: ఇందూరు వద్ద తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారి దుస్థితి

పెద్దేముల్: ప్రధాన రోడ్లన్నీ ప్రాణసంకటంగా మారుతున్నాయి. పేరుకే ప్రధాన రహదారులు.. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. తాండూరు–జహీరాబాద్ ప్రధాన మార్గంలో పెద్దేముల్ మండల ఇందూరు కల్వర్టు వద్ద ప్రధాన రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అదే విధంగా సంగారెడ్డి–కోటపల్లి ప్రధాన రహదారి అడుగడుగునా గంతలమయంగా మారండంతో ప్రయాణికులు విసుగెత్తిపోతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మారేపల్లి, తట్టెపల్లి, అత్కూర్, బండమిదిపల్లి, బుద్దారం, పెద్దేముల్, ఓగ్లాపూర్, నాగులపల్లి గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుంతలుగా గోపన్‌పల్లి రోడ్డు



తాండూరు రూరల్: గోపన్‌పల్లి రోడ్డు..

తాండూరు రూరల్: తాండూరు మండలం గోపన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు రహదారి పనులు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణం కొరకు కంకరవేసి వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షం కురవడంతో రోడ్డులో గుంతలు ఏర్పడి, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే రోడ్డు పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా నిషేధిత మందుల విక్రయం

- ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఇష్టానుసారంగా అమ్మకం
- తూతూమంత్రంగా తనిఖీలు



ఇటీవల పరిగి ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పరిగి: వ్యవసాయ రంగంలో నిషేధిత, హానికర మందులను విక్రయించరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభంలో ఎరువులు, ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో నిషేధిత మందులు దొరకడంతో వాటిని సీజ్ చేశారు. ఇష్టానుసారంగా నిషేధిత మందులు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథులే లేరని రైతులు వాపోతున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రసాయన మందులను నిషేధించాయి. వాటి వాడకం వల్ల ప్రజలకు పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని నిర్ధారణ కావడంతో నిషేధించాయి. పంటలకు ఆశించే కీటకాలు, కలుపును నివారించేందుకు మందులు వాడడం ద్వారా భూమిలో ఉండి పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా చనిపోతున్నాయని పరిశీలనలో తేలింది. కీటక నాశినికి మందును పిచికారీ చేయడంతో ఆ మందు పంట దిగుబడిలో లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రజలు కలుషిత ఆహారాన్నే తీసుకుంటున్నారని అధికారులు గుర్తించారు. దీంతో క్యాన్సర్ బారిన పడుతున్నారని, పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని గుర్తించారు. దీంతో ప్రభుత్వాలు వందల సంఖ్యలో మందులను నిషేధించింది. కానీ వాటిని ఫెర్టిలైజర్ దుకాణదారులు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కొంత మంది వ్యాపారులు దుకాణాల్లో, వేరే గదుల్లో, గోదాంలలో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. పరిగి నియోజకవర్గంలో ఐదు మండలాలు, 1,50,000 ఎకరాల సాగు భూమి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో లక్ష ఎకరాలకు పైగానే వివిధ పంటలను సాగు చేశారు. పత్తి, మొక్కజొన్న, జొన్న, పెసర్లు, వరి తదితర వంటివి సాగు చేశారు. నియోజకవర్గంలో దాదాపు వంద దాకా ఫెర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. ఇటీవల మొస్తరు వర్షాలు కురవడంతో పత్తి, మొక్కజొన్న తదితర పంటల్లో కలుపు ఎక్కువగా వచ్చింది. ప్రభుత్వం కలుపు మందులను పూర్తిగా నిషేధించింది. అయినప్పటికీ విక్రయిస్తున్నారు. విషయం వ్యవసాయ అధికారులకు తెలిసినా వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

నిషేధిత మందులు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలి. అలాంటి మందులు విక్రయించరాదని ఫెర్టిలైజర్ దుకాణ యజమానులకు సూచించాం. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అంతే కాకుండా దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తాం. ఇప్పటికే అన్ని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాం. ఇక ముందు కూడా తనిఖీలు చేసి నిషేధిత మందులు విక్రయిస్తుంటే చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి

గోశాల నుంచి గోవుల తరలింపు

శంకర్‌పల్లి: కలెక్టర్ ఆదేశాలతో దొంతాన్‌పల్లి గోశాలలో ఉన్న గోవులను గురువారం వివిధ గోశాలలకు తరలించారు. నిర్వహణ సక్రమంగా లేక గోవులు మృత్యువాత పడుతుండడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, చేవెళ్ల ఆర్డీవో వేణుమాధవ్, శంకర్‌పల్లి తహసీల్దార్ నయిమొద్దీన్, సీఐ నరేష్ సమక్షంలో గోవులకు ట్యాగింగ్ చేసి తరలించారు. నగరంలోకి ఫిలింనగర్‌లో గల తులసి గోశాల, మహాలింగపురంలోకి సప్తమి గోశాల, మియాఖాన్‌గడ్డలోని శేణుగోపాల స్వామి గోశాల, అమీన్‌పూర్ పరిధిలో భ్రమరాంబ గోశాల, కోకాపేట్ పరిధిలోని శ్రీకృష్ణ గోశాలకు గోవులను తరలించారు. శంకర్‌పల్లి సీఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కాగా పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డికి చెందిన భూమి 3.20ఎకరాలను నగరానికి చెందిన శ్రీనివాస్ పది సంవత్సరాల లీజుకు తీసుకొని గోశాలను నిర్వహించడం జరిగిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. లీజు కాలం ముగియడంతో గోవుల సంరక్షణను ఎవరూ పట్టించుకోలేదని దీంతో అవి మృత్యువాత పడినట్లు తెలిపారు. భూ యజమానులు కూడా తమ భూమిలో నుంచి గోశాలను తీసివేయాలని కోర్టును ఆశ్రయించడం జరిగింది. దీంతో గోవులను ఇతర గోశాలలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన గురువారం కొందుర్గు మండలంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నరేష్‌కు ఆవు ఉంది. గురువారం సాయంత్రం ఆమును మేతకోసం వదిలాడు. గ్రామ సమీపంలోని పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఆవు విలువ దాదాపు రూ. 60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

గర్భిణులకు అండగా కేసీఆర్ కిట్లు



గర్భిణులకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: గర్భిణులు, వారికి పుట్టబోయే బిడ్డల ఆరోగ్య సంరక్షణకై రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కేసీఆర్ కిట్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మండల వైద్యాధికారి మాధురి, సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్‌లు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 70మంది గర్భిణులకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. కిట్లలో ఉండే ప్రొటీన్లు, విటమిన్లు గర్భిణులకు సుఖ ప్రసవం జరిగి, తల్లీబిడ్డా ఆరోగ్యకరంగా ఉండేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. అనంతరం సంక్రమిత వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్త వహించాలని, వాటి ఆరోగ్యానికి సరైన జాగ్రత్తలు తీసుకోనియెడలా వాటి ద్వారా మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రత్న, లత, యాదమ్మ, విజయలక్ష్మి, సుజాత, రత్నమ్మ, గౌరీ, మైభమ్మ, జంగమ్మ, భారతమ్మ, జ్యోతి, శ్రీలత, వెంకటయ్య, ప్రశాంత్, శ్రీనివాస్, సిరాజ్, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

మహిళా రైతుల ఆవేదన

అనంతగిరి: కబ్జాదారుల నుంచి తమ భూమిని కాపాడాలని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్పల్లి మండలం గుండ్ల మర్పల్లికి చెందిన సంగమ్మ, లలిత, గౌరమ్మ, చంద్రకళ, అన్నపూర్ణ తమ భూములను కబ్జాదారుల నుంచి రక్షించాలని వేడుకుంటున్నారు. గుండ్ల మర్పల్లిలోని సర్వే నంబర్ 54, 60లో 32 ఎకరాల 5 గుంటల భూమి తమకు వారసత్వంగా వచ్చిందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కూడా మర్పల్లి పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. కోర్టు ఆర్డర్ పోలీసులకు చూపించామని, అయినా ఫైనల్ ఆర్డర్ తీసుకురావాలని పోలీసులు అంటున్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేసుకొని జీవనోపాధి పొందుతున్నామని, విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరారు.



బాధిత రైతులు

పాఠశాల నుంచే సాంకేతిక పరిజ్ఞానం



ట్యాబ్ ద్వారా విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

తరగతి గదిలో డిజిటల్ విద్యాబోధన
- బడుల సమగ్ర వివరాల నమోదు
- విద్యాలయాలకు అందిన ట్యాబ్‌లు
- మురిసిపోతున్న విద్యార్థులు

బొంరాస్‌పేట: ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీన్ని గుర్తించిన విద్యాశాఖ విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా ఇవ్వాలని సంకల్పించింది. విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లో పాఠశాలకు సంబంధించిన సమగ్ర వివరాలు ఉంచేందుకు ఓ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. స్కూల్‌కు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందవచ్చు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, రోజువారి వివరాల నమోదు చేస్తారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ఒకటి, ఎక్కువ మంది విద్యార్థులుంటే రెండు ట్యాబ్‌లు అందిస్తారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లో ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధన మొదలైంది.

సమగ్ర వివరాలు

పాఠశాలకు చెందిన ప్రతి విషయాన్ని ట్యాబ్‌లలో పొందుపర్చారు. మధ్యాహ్న భోజన పథకం, బియ్యం వివరాలు, పరీక్షల మూల్యాంకనం, చైల్డ్ ఇన్‌ఫో, ఉచిత పథకాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు ఇలా పాఠశాలకు సంబంధించిన అనేక విషయాలను నిక్షిప్తం చేశారు. అంతేకాకుండా ఎమ్మార్సీలో మండల స్థాయిలో నమోదు చేసే కార్యక్రమాలను కూడా ట్యాబుల్లో పొందుపర్చారు. ఆన్‌లైన్ తరగతుల బోధన, ఆదర్శ బోధన, టీ షాట్ బోధనలు పొందిపర్చడం విశేషం. శాంసంగ్ ఫోన్ కంపెనీకి చెందిన ట్యాబ్‌లు సిమ్, నెట్ బ్యాలెన్స్ విద్యాశాఖ భరించనుంది. ప్రస్తుతం తాత్కాలికంగా బైజూస్ యాప్ డైన్‌లోడ్ చేసి వాడుకునే సదుపాయం కల్పించనున్నట్లు తెలుస్తోంది.

ఎంతో ఉపయోగం



జిల్లాల్లో మొత్తం 790 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి 823 ట్యాబ్‌లు ఇచ్చాం. పాఠశాల, క్లస్టర్, మండల స్థాయిలో వివరాల నమోదుకు కొంత ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం ట్యాబ్‌లతో తీరినట్లే. అన్ని వివరాలు నమోదు చేసేందుకు, విద్యార్థులకు ఆన్‌లైన్ అభ్యాసానికి ఎంతో ఉపయోగం.

– రేణుకాదేవి, డీఈఓ, వికారాబాద్